రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చీపురుపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు చీపురుపల్లి పట్టణానికి చెందిన జి.గోవర్ధన్ నాయుడు ఎంపికయ్యాడు. అండర్-14 కరాటేలో కుమిటి/స్పేరింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ట్రైనర్ డి.రమేష్ బుధవారం తెలిపారు. గోవర్ధన్‌నాయుడును పలువురు అభినందించారు.


చీపురుపల్లి: కోచ్ రమేష్‌తో గోవర్ధన్‌నాయుడు

• జామి: జిల్లా ఆరోగ్యశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గైడ్ టీచర్ గుండాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన ఎం.ఉషశ్రీ, బి.సాయితి, ఎ.చైత్రాలి ఉత్తమ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. డీఎంహెచ్‌ఓ, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రాజేష్ చేతులు మీదుగా రూ.3వేలు నగదు ప్రోత్సాహం, ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

గజపతినగరం: జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు గణపతినగరం బాలికోన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, ఎస్.ధార్రాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో వాలీబాల్ విభాగంలో బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎ.వెంకటసుష్మ, జి.రాజేశ్వరి అండర్-17 జట్టుకి, ఎస్.గాయత్రి, బి.శరణ్య అండర్-14 జట్టుకి ఎంపికైనట్లు చెప్పారు. వీరు ఈ నెల 29న విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.


జామి: విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు

• మెరకముడిదాం: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కుచ్చర్లపాటి ఆదిత్యవర్మ, ఎం.భావన, ఎల్.స్వర్ణప్రియ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయురాలు ఆదిలక్ష్మిని పాఠశాల హెచ్‌ఎం కోట్ల ఎల్లంనాయుడు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.అప్పలరాజు, గ్రామస్తులు అభినందించారు.

• గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి కేజీబీవీకి చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. గజపతినగరం బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం జరిగిన అండర్-14,17 నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-14, 17 విభాగంలో కేజీబీవీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి, పీఈటీ భవాని అభినందించారు.


గజపతినగరం: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమేష్‌కుమార్, తదితరులు


గంట్యాడ: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ జ్యోతి


మెరకముడిదాం: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఎల్లంనాయుడు, తదితరులు


చీపురుపల్లి రూరల్: ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

బాల్‌బ్యాడ్మింటన్‌లో..

చీపురుపల్లి రూరల్: మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం.హరిణి రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 26న వాడాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 30 నుంచి అక్టోబర్-2 వరకు నంద్యాల జిల్లా మహానందిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానుంది. విద్యార్థినిని పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, పీడీ ఎం.రామారావు అభినందించారు.

క్లుప్తంగా

70 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

గుర్ల: మండలంలోని రాగోలులో విజయనగరం పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ చందక బంగారునాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 70 మందికి కంటి పరీక్షలు చేయగా, వారిలో 20 మందికి శస్త్రచికిత్స అవసరమని డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

రుచికరంగా వండిపెట్టాలి


వంటలను రుచి చూస్తున్న మండల ప్రత్యేకాధికారి పాపారావు

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని మండల ప్రత్యేకాధికారి వై.పాపారావు బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని, రుచికరంగా వండిపెట్టాలని, వంటగది పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ వై.పద్మజ, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, గొరపల్లి శివ, ఎంఈఓ బండారు శ్రీనివాసరావు, హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ గోవిందరావు

జామి: స్థానిక పోలీస్ స్టేషన్‌ని డీఎస్పీ ఆర్.గోవిందరావు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ఆవరణాన్ని పరిశీలించారు. ఆయన వెంట సీఐ బాలసూర్యారావు, ఎస్సై వీరబాబు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చీపురుపల్లి: మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. విజయనగరానికి చెందిన వరుణ్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు పల్లవి చైతన్య, ఉమామహేశ్వరరావు, సూర్యనారాయణ సుమారు 50 మంది విశ్రాంత ఉద్యోగులకు దంత పరీక్షలు చేశారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సంఘ నాయకులు ఎస్.లక్ష్మణరావు, ఎ.సత్యనారాయణ, కె.జగన్నాతరావు, ఆర్.ఉమామహేశ్వర పట్నాయక్, చీపురుపల్లి, మెరకముడిదాం మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న వెంకటరావు

శృంగవరపుకోట: మండలంలో కొట్టాం గ్రామంలో పేదలకు అదే గ్రామానికి చెందిన బొడబళ్ల వెంకటరావు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. తన తండ్రి బొడబళ్ల పెదనాయుడుబాబు జ్ఞాపకార్థం ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ ఏడాది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు గొల్లు నారాయణమూర్తి, అప్పలసత్యం తదితరులు పాల్గొన్నారు.

30న షికారుగంజిలో ఆరోగ్య సురక్ష

దత్తిరాజేరు: ప్రభుత్వం పేద, మధ్య తరగతులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని, ఈనెల 30 షికారుగంజి సచివాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండల పరిషత్ కార్యక్రమంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ..వైద్య సిబ్బంది, వలంటీర్లు చేసిన ఆరోగ్య సర్వేలో అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గుర్తించిన వారికి వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు అందించడం జరుగుతుందన్నారు.

ఆర్‌బీకే సేవలు రైతులకు వరం

• ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్

మెంటాడ(గజపతినగరం రూరల్): గ్రామీణ ప్రాంతాల్లో రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు స్థానిక రైతులకు ఒక వరమని జిల్లా ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి రైతుభరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో పండే పంటలు, రైతుల ఆదాయ మార్గాలపై ఆరా తీశారు. ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. ఆర్బీకేలో ఏర్పాటుచేసిన కియోస్కో పనితీరు, ఉపయోగాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వ్యవసాయ సంచాలకులు మహారాజన్, మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి ఉన్నారు.


ఆర్‌బీకేలో కియోస్కో పనితీరుపై ఆరాతీస్తున్న ట్రైనీ కలెక్టర్

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

• జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వరరెడ్డి

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, ఇతర సబ్జెక్టులను సులభంగా అర్థం చేసుకునేలా బోధించాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గజపతినగరం బాలుర హైస్కూల్లో బుధవారం జరిగిని స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా మరింత కష్టపడి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు విమలమ్మ, చక్రధర్‌తో పాటు బాలుర హైస్కూల్ హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌పీలు జగదీష్, జనార్దన్, కె.మైసూరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

• డిప్యూటీ ఈఓ వాసుదేవరావు

చీపురుపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని డిప్యూటీ ఈఓ కంది వాసుదేవరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సబ్జెక్టుపై విద్యార్థులు ఆసక్తి పెంచుకునేలా బోధన ఉండాలన్నారు. విద్యావిధానంలో నూతన పద్ధతులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తోందన్నారు. ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ రాము, డైట్ లెక్చరర్ ఎల్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వాసుదేవరావు

పర్యాటక ప్రదేశాల సందర్శనతో నూతనోత్సాహం

గజపతినగరం: ప్రపంచంలోని చాలా దేశాలకు పర్యాటక రంగమే ప్రధాన ఆర్థిక వనరని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, హిస్టరీ లెక్చరర్ చల్లా శ్రీనివాసరావు, మాధవరావు, మోహన్‌రాజ్, విజయదుర్గా, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ సుగుణకుమారి, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కొత్తవలస: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న భారత్ డిఫెన్స్ అకాడమీలో అగ్నిప్రమాదాల నివారణపై కొత్తవలస ఫైర్‌స్టేషన్ అధికారి వై.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటల నివారణపై ఫైర్‌స్టేషన్ సిబ్బంది డెమో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మేన్ కె.కనకారావు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.


అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

శింగరాయిలో ఆరోగ్య సర్వే

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను బుధవారం ప్రారంభించినట్లు సర్పంచ్ నిరుజోగి వెంకటరావు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కరు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ఆరాతీశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు అందజేశారు. అక్టోబర్ 17న గ్రామంలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ర్యాబిస్‌పై అప్రమత్తం

గంట్యాడ: ప్రాణాంతకమైన ర్యాబీస్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని గంట్యాడ పీహెచ్‌సీ వైద్యురాలు హేమలత సూచించారు. వరల్డ్ ర్యాబీస్ డే, వరల్డ్ పేషెంట్ సేఫ్టీ డే సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్క కరిచిన వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీకి వెళ్లి ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ర్యాబీస్ వ్యాధి బారినపడి మృతిచెందే అవకాశం ఉందన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస: వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఆర్.ఉమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస మండలం చింతలపాలెం అగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త(ఎస్టీ), అప్పన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ (బీసీ-బీ), వేపాడ మండలం బానాది అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ (జనరల్), ఆకులసీతంపేట అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ (ఎస్టీ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జూలై 1, 2023 నాటికి 21 సంవత్సరాలు పూర్తయి 35 సంవత్సరాల లోపు వయసున్న, పదో తరగతి పాసైన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను కొత్తవలస సీడీపీఓ కార్యాలయంలో అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అదజేయాలని సూచించారు.

చెల్లింపులపై దృష్టి సారించండి

మెరకముడిదాం: గృహనిర్మాణాలకు సంబంధించి 90 పనిదినాలకు చెందిన చెల్లింపులపై హౌసింగ్ ఏఈ సూచించిన ప్రాప్తికి చర్యలు చేపట్టాలని క్షేత్రసహాయకులను ఎంపీడీఓ ఎం.రత్నం ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడుతో కలిసి బుధవారం క్షేత్రసహాయకులతో సమావేశమయ్యారు. మొక్కల సంరక్షణ చర్యలు చేపడుతున్న వేతనదారులకు వేతనాల చెల్లింపు వేగవంతం చేయాలని సూచించారు. భువన యాప్‌లో పనులకు సంబంధించిన ఫోటోలను అప్‌లోడ్ చేయాలన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

మెరకముడిదాం: బాల్యవివాహాలు చేసుకున్న వారికి భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఎంపీడీఓ ఎం.రత్నం, చీపురుపల్లి ఐసీడీఎస్ పీఓ కె.వి.యస్.రాజేశ్వరి తమ సిబ్బందితో కలిసి రామాయవలస, రాచగుమడాం గ్రామాల్లో బాల్యవివాహాలు చేసేందుకు సిద్ధమవుతున్న తల్లిదండ్రులకు బుధవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్యవివాహాల వల్ల భవిష్యత్‌లో కలిగే అనర్థాలను వారికి వివరించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమని, ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై అవగాహన


కొత్తవలస: తుమ్మికాపల్లిలో ఆయుష్మాన్ భవ కార్డులను అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది


గుర్ల: ఆయుష్మాన్ భవ కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీదేవి

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. తుమ్మికాపల్లి, ముసిరాం, దేవాడ, వీరభద్రపురం, ఉత్తరాపల్లి, నిమ్మలపాలెం తదితర గ్రామాల్లోని హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాల్లో ఎన్‌సీడీ, సీడీ, స్క్రీనింగ్, ప్రజల ఆహారపు అలవాట్లు, జీవనశైలి, వ్యాయామం, యోగా, డ్రగ్ డిస్ట్రిబ్యూషన్, ఇంటింటికీ ఆయుష్మాన్‌భవ ఆరోగ్య కార్డుల పంపిణీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ముసిరాం, తుమ్మికాపల్లి సర్పంచ్‌ల చేతుల మీదగా పలువురుకి ఆరోగ్య కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు సత్యారావు, పీహెచ్ఎన్ జగదాంబ, ఈఓలు నరసింహారావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

• గుర్ల: ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులను చింతపల్లిపేట సర్పంచ్ జమ్ము శ్రీదేవి బుధవారం పంపిణీ చేశారు. గ్రామంలో మొదటి విడతగా 73 మందికి ఈ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్డుల ద్వారా ఏడాదికి రూ.5 లక్షల వరకు చికిత్స అందిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, తెట్టంగి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ పంచాయతీలో రోడ్డు మెటల్ బిల్డింగ్ స్టోన్‌క్రషర్ ఏర్పాటుకు గాను కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సరిత ఆధ్వర్యంలో బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి డీఆర్‌ఓ ఆర్.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ సర్వే నెం.58లో 3.50 హెక్టార్లులో రోడ్డు మెటల్ బిల్డింగ్ స్టోన్ 83,011 క్యూబిక్ మీటర్లు తవ్వకం చేపట్టేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని, ఓవర్ లోడ్‌లు తగ్గించాలని, కాలుష్యం వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని సర్పంచ్ బీల రాజేశ్వరి అధికారులను కోరారు. దీనిపై అధికారులు, క్వారీ యాజమాన్యం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఆర్‌ఓ సూర్యనారాయణ

జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించండి

చీపురుపల్లి రూరల్(గరివిడి): రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందని, ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని వైఎస్సార్‌సీపీ గరివిడి మండల నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు అన్నారు. గరివిడి మండలం శివరాం గ్రామంలో బుధవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ పాలనకు, ఈ ప్రభుత్వ పానలకు మధ్య తేడాను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ పేద కుటుంబానికి మేలు జరిగిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి టీడీపీ నేతలు ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గవిడి శ్రీధర్, గవిడి దాలినాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, కోనూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పారావు, జీసీఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్, గుడివాడ తమ్మినాయుడు, యల్లంటి పోలీస్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సీఎం సందేశ పత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

సంక్షిప్తంగా..

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ అధ్యాపక పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎకనామిక్స్, తెలుగు, మ్యాథమెటిక్స్, కామర్స్, ఫిజిక్స్, కెమిస్ట్రి సబ్జెక్టలను బోధించేందుకు సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సంక్షేమాధికారిగా లక్ష్మణరావు

దత్తిరాజేరు: స్థానిక బీసీ బాలుర హాస్టల్ సంక్షేమాధికారిగా లక్ష్మణరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గజపతినగరం బీసీ బాలుర హాస్టల్‌లో అటెండర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. నిత్యం వసతి గృహంలో ఉంటూ విద్యార్థుల యోగక్షేమాలు చూసుకోవడంతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తానన్నారు.

74 మందికి వైద్య సేవలు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 74 మందికి వైద్య సేవలందించినట్లు డాక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. బీపీ, సుగర్, జ్వరాలతో బాధపడుతున్న పలువురికి మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దీపిక, మీమోమోం, శ్రీదేవి పాల్గొన్నారు.

సౌత్ జోన్ జంబోరీకు కొత్తవలస విద్యార్థులు

కొత్తవలస: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సేవాశ్రీ స్కౌట్ యూనిట్, రుద్రమ్మదేవి గైడ్ యూనిట్‌లలో శిక్షణ పొందిన 13 మంది విద్యార్థులు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు గుంటూరు జిల్లా పొన్నూరులో జరిగే సౌత్ జోన్ జంబోరిలో పాల్గొనేందుకు పయనమయ్యారు. ఈ ఈవెంట్‌లో సౌత్ జోన్ నుంచి ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, సౌత్, వెస్టు, సెంట్రల్ రైల్వేలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాలు పాల్గొనున్నాయి.

వైఎస్సార్ బీమా అందజేత

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన గొట్టుపల్లి స్వామినాయుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి మంజూరు కావడంతో తక్షణ సాయంగా రూ.10 వేలును స్థానిక సర్పంచ్ తాళ్లపూడి కీర్తి మృతుని భార్య లక్ష్మికి అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. వైఎస్సార్ బీమాతో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక ఆసరా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.


నగదు అందచేస్తున్న సర్పంచ్ కీర్తి, సచివాలయం ఉద్యోగులు